క్లుప్తంగా

భారత్ సేవా రత్న నేషనల్ అవార్డుకు వెల్లటూరు వాసి



నంబూరు నాగభూషణరావు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన నంబూరు నాగభూషణరావు మనం ఫౌండేషన్ నిర్వాహకులు భారత్ సేవా రత్న నేషనల్ అవార్డును (2025) ఈనెల 14న హైదరాబాద్‌లో అందుకోనున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాసవి క్లబ్ నిర్వహిస్తున్న సేవలకు గాను ఆయనను అవార్డుకు ఎంపికచేశారని తెలిపారు. ఈ సందర్భంగా నాగభూషణరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అవార్డును ఫౌండర్ అండ్ ఛైర్మన్ ఫౌండేషన్ డాక్టర్ కె.చక్రవర్తి చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలి



కూచిపూడి (వేమూరు): ఇరిగేషన్, డ్రెయినేజీ కాలువల కట్టలకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి లాకుల వద్ద ఇరిగేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు డిస్ట్రిబ్యూటరీ కమిటీ రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి సాగునీరు అందించాల్సి బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు, ప్రాజెక్ట్ చైర్మన్‌లు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలో దోమల బెడదతో వైరల్ ఫీవర్లు అధికంగా విజృంభిస్తుండడంతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచి దారా రవి కిరణ్మయి చెన్నయ్య, కార్యదర్శి మాజీనాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో ఎబిట్ పిచికారీ, మురుగు పూడికలు తొలగించడం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలను సిబ్బందితో నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు.

జూద స్థావరంపై దాడి

బాపట్ల టౌన్: పటేల్‌నగర్ 2వ లైన్‌లోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం పట్టణ సీఐ రాంబాబు తమ సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 10 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.43,600 స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రక్తహీనత నివారణకు నులిపురుగు మాత్రలు

- ధూళిపూడి పీహెచ్‌సీ పరిధిలో 5,168 మంది పిల్లలకు పంపిణీ
- నిజాంపట్నం మండలంలో 2,850 మంది పిల్లలకు



భట్టిప్రోలులో పిల్లలకు మాత్రలు వేస్తున్న శ్రీనివాసరావు

నిజాంపట్నం: చిన్నారులలో రక్తహీనతను నివారించేందుకు నులిపురుగు నివారణ మందులు దోహదపడతాయని కూచిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగార్జున తెలిపారు. నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు వేసే కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పర్యవేక్షించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లోని 2,850 మంది చిన్నారులకు నులిపురుగు నివారణ మందులు అందించామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: జాతీయ నులి పురుగుల నిర్మూలన (డీ వార్మింగ్) కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు మండలం ఐలవరం-2 సచివాలయం పరిధిలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించడం, పరాన్న జీవులుగా మారే విధానం తద్వారా పోషకాహార లోపం కలుగుతుందని పంచాయతీ కార్యదర్శి వక్కలగడ్డ సురేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది వివరించారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశా కార్యకర్తలు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, డెప్యూటి తహసీల్దార్ ఎ.శాంతకుమారి, భట్టిప్రోలు సర్పంచి దారా రవి కిరణ్మయి, చెన్నయ్య, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, నాగమల్లేశ్వరరావులు పాల్గొన్నారు. మండలంలోని వెల్లటూరు, భట్టిప్రోలు పీహెచ్‌సీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు మాత్రలు అందించామని వైద్యులు మోహాసీనా తాజ్, గేరా అబ్రహం లింకన్, పవన్ చైతన్యలు తెలిపారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి బి.మాజీ నాయక్, సీహెచ్‌వో బంకా మంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట పద్మావతి, హెల్త్ విజిటర్ టి.రుసుముల్లా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కూచినపూడిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

నగరం: నులిపురుగుల నిర్మూలనకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేసుకోవాలని ధూళిపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జాన్‌ప్రసాద్ తెలిపారు. మండలంలోని ధూళిపూడి తడవర్తి బాపయ్య స్మారకోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఆల్‌బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నులిపురుగుల వల్ల పిల్లలకు రక్తహీనతతో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకే నులిపురుగుల నిర్మూలనకు పాఠశాలలోని విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ధూళిపూడి పీహెచ్‌సీ పరిధిలో 5,168 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నగరం ఎస్వీఆర్ఎం కళాశాలలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లెట్రిన్ పైపులకు మెస్ ఏర్పాటు చేయాలి



మెస్‌ను ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రేపల్లె: దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ మరుగుదొడ్లకు ఉన్న లెట్రిన్ పైపులకు మెస్‌లను ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని పలు గృహాలకు మంగళవారం మున్సిపల్ సిబ్బంది లెట్రిన్ పైపులకు మెస్‌లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన కార్యక్రమాన్ని పర్యవేక్షించిన అనంతరం మాట్లాడారు. పైపులకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవడం వల్ల దోమలు లోపలికి వెళ్లే అవకాశం ఉండదన్నారు. ట్యాంకులో ఉన్న దోమలు బయటకు వచ్చే అవకాశం లేక చనిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ సెప్టిక్ ట్యాంకుల పైప్‌లకు మెస్‌లు ఏర్పాటు చేసుకొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, సెక్రెటరీలు సురేంద్ర కుమార్, పవన్ కుమార్, మహేష్, కల్యాణి, వందన, ప్రియదర్శిని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పేరలి గ్రామం వైఎస్సార్ సీపీ అడ్డా



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



యడ్లపల్లి కార్యక్రమంలో పార్టీ నాయకులు

కర్లపాలెం: తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు టీడీపీ జెండాలు మెడలో వేయించుకుని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భారీగా తెలుగుదేశం పార్టీలో చేరారని ప్రచారం చేయడం సమంజసం కాదని పేరలి గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, పేరలి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సలగల ధర్మేంద్ర అన్నారు. మంగళవారం పేరలి గ్రామంలో వారు మాట్లాడుతూ.. పేరలి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్రుముచ్చు మీరయ్య, మరో కార్యకర్త సుభానీ ఆరు నెలల క్రితమే టీడీపీలో చేరారని గుర్తు చేశారు. పేరలి గ్రామం ఎప్పటికీ వైఎస్సార్ సీపీ అడ్డా అని వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజక వర్గం సమన్వయ కర్త మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి వెంట నిలుస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామ యువజన కమిటీ అధ్యక్షుడు ఆట్ల అర్జున్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ చిరంజీవి తదితరులు ఉన్నారు.

అమర్తలూరు(వేమూరు): కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు అందక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు రమాదేవి తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చంద్రబాబు మోసపు మాటలకు మహిళలు నష్టపోయారని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లూరు: కూటమి ప్రభుత్వం కుతంత్రాల కారణంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు తీరని నష్టం జరుగుతుందని జువ్వపాలెం సర్పంచి భూపతి కిశోర్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని జువ్వలపాలెంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని బాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుంటూరు రామారావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం కౌలు రైతులను పూర్తిగా మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చావ సత్యనారాయణ తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసం గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండా రెడ్డి, షేక్ అబ్దులా, సయ్యద్ ఉద్దీన్, భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘పొలం పిలుస్తోంది’లో రైతులకు అవగాహన



వెల్లటూరు కార్యక్రమంలో అధికారులు, రైతులు



యడవూరు గ్రామంలో హేమంత్ భారత్‌కుమార్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు, పెదలంక గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి వి.బుష్ మాట్లాడుతూ.. ప్రతి రైతు తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు సంబంధిత పత్రాలు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలని పేర్కొన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఆగస్టు 15తో ముగియనున్నదని తెలిపారు. రైతులు గమనించాలని కోరారు. ఆయా గ్రామాల్లో పసుపు, గుమ్మడి పంటలను పరిశీలించి వాటిని యాజమాన్య పద్ధతులను సూచించారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు సాగర్, జ్యోతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): వరి పైరు నాటిన 40 రోజులకు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భారత్ కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి, యడవూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజనలో వరి పంట, ఇతర పంటలను సాగుచేస్తున్న రైతులు 2025 సీజనలో ఈ-పంట నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. కలుపు మందు వేసే సమయంలో పొలంలో పలుచగా నీరు ఉండాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు, వీఆర్వో అంకమ్మరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రవల్లీక, ఉద్యానవన సహాయకులు శివంక ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకుల్లో రుణాలు పొందాలి

చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు నగదు తీసుకోకుండా బ్యాంకుల్లో రుణాలు పొంది వారి అవసరాలు తీర్చుకుంటూ రుణాలు సకాలంలో చెల్లించుకోవాలని మాజీ ఆప్కో డైరెక్టర్ దివి రాంబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని కుంచలవారిపాలెంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సోషల్ సెక్యూరిటీ స్కీంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరుకుపల్లి బ్రాంచ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం సంపత్ మాట్లాడుతూ.. గతంలో జన్‌ధన్‌యోజన కింద జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచిన వారందరూ తిరిగి ఈకేవైసీ ద్వారా తమ ఖాతాలను వాడుకలోకి తీసుకురావాలని ఖాతాదారులకు సూచించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుజీవరాణి, పలువురు బ్యాంక్ అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

త్యాగాలకు ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించింది

భట్టిప్రోలు: సమర యోధులు పోరాటం చేసి అమరులయ్యారని.. వారి త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం అని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్)బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవంపై మంగళవారం భట్టిప్రోలు మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశంలో ఎన్నో జాతులు, కులాలు ఉన్నప్పటికీ అందరూ ఐకమత్యంగా ఉంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తిని అలవరచుకోవాలని ఆయన కోరారు. స్వాతంత్ర్యం పర్వదినాన ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని తెలిపారు.

చిత్రలేఖనంలో సూరేపల్లి విద్యార్థిని ప్రతిభ



స్వరూప

సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుచున్న విదార్థిని చలమచర్ల స్వరూప చిత్రలేఖనంలో ప్రతిభ చాటింది. బాపట్ల స్కూల్‌లో జిల్లా స్థాయిలో హర్‌ఘర్ తిరంగా అనే అంశంపై మంగళవారం నిర్వహించిన పోటీల్లో ద్వితీయస్థానం సాధించింది. ప్రతిభ చూపిన స్వరూపను ప్రధానోపాధ్యాయులు కూచిభొట్ల శ్రీనివాస శర్మ, హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావులు అభినందించారు.

భోజనశాల నిర్మాణ దాతకు నివాళులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో మంగళవారం పట్టెం కోటేశ్వరమ్మ 21వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ.. 2014లో కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె డాక్టర్ పాపోలు రమాదేవి సౌజన్యంతో భోజన శాల ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, లక్ష్మి పార్వతి, సత్యరత్న, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.సుగుణ కుమారి పాల్గొన్నారు.

డెంగీ బాధితులను ఆదుకోవాలి

బాపట్ల: డెంగీ జ్వరం బారిన పడిన వారికి తక్షణమే వైద్య సహాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య వైద్యాధికారులను కోరారు. మంగళవారం పట్టణంలో ఏరియా వైద్యశాలను ఆయన సందర్శించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థతో మాట్లాడారు. జ్వరంతో ఆసుపత్రికి వచ్చే వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని డాక్టర్ సిద్ధార్థ అన్నారు.


ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలం

వేమూరు: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని మాజీ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్ సెల్ అధ్యక్షులు విష్ణుమొలకల వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో కూటమి ప్రభుత్వం దారుణంగా వ్యవహరించిందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓటు వేసే హక్కు పూర్తిగా కోల్పోయారని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ఓటు వేయకుండా రిగ్గింగ్ చేశారని ఆయన ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలను ఓట్లు వేయించే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్పనున్నారని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

డెంగీ నిర్మూలనపై అవగాహన

భట్టిప్రోలు: డెంగీ ప్రబలడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దళిత బహుజన రీసోర్స్ సెంటర్(డీబీఆర్సీ) కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీలత తెలిపారు. భట్టిప్రోలు మండలంలో డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలకు చైతన్యం కల్పిస్తూ జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళీ సూచనల మేరకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం భట్టిప్రోలు లూథరిన్ చర్చి సమీపం వద్ద మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. దోమ తెరలు తప్పని సరిగా వినియోగించుకోవాలని కోరారు. ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను పరిశీలించి శుభ్రం చేసుకోవాలని స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్సీ ప్రతినిధులు భగవాన్‌దాస్, ఆనంద్, మనోజ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెపండుగ అమలు జాప్యంపై నిరసన



కొల్లూరు: రహదారుల మరమ్మతులు చేపడతామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన గళమెత్తారు. పల్లెపండుగ పేరుతో సంక్రాంతి లోపు రహదారులు మరమ్మతులు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో విఫలమవ్వడాన్ని నిరసిస్తూ మండలంలోని అనంతవరంకు చెందిన రైతులు, ప్రజా సంఘాల నాయకులు తెనాలి-ఈపూరు ఆర్అండ్‌బీ రోడ్డుపై మంగళవారం ధర్నా నిర్వహించారు. రోడ్డు నిర్మాణం పనుల పేరుతో రోడ్డును పెకిలించి వదిలివేయడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో మెటల్ రాళ్లు లేచి వాహనదారులు, పాదచారులకు తగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు బొనిగల సుబ్బారావు, స్థానిక వైస్ ప్రెసిడెంట్ బి.రాంబాబు, రైతులు జాలాది రంగారావు, ధూళిపాళ్ల రవి, గోళ్ల రాంబాబు, ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, మున్నంగి శ్రీనివాసరావు, అశ్విని కుమార్ తదితరులు పాల్గొన్నారు.